సాక్షి నిజామాబాద్


శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



జిల్లాకు భారీ వర్ష సూచన

48 గంటల్లో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

- IIలో ▸



ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో..

స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 13,910 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
30.0 /22.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బీసీ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొననున్న రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ ఎస్.నిరంజన్ గురువారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయనను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. వారి వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

బెటాలియన్ ఏఆర్ ఎస్సైకి విశిష్ట సేవా పతకం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్సై రామ్ దులారి సింగ్‌కు గురువారం కేంద్ర ప్రభుత్వం విశిష్ట సేవా పతకం ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశేష సేవలందించిన వారికి ప్రభుత్వం ఈ పతకం అందజేస్తుందని బెటాలియన్ అధికారులు తెలిపారు.

గంగాసాగర్‌కు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి చెందిన కానూరి గంగాసాగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు–2025ను అందుకున్నాడు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యారంగ విభాగంలో గంగాసాగర్ అవార్డును అందజేశారు. 28 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా తీర్చిదిద్దిన నేపథ్యంలో ఈ అవార్డు వరించింది. అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్‌సింగ్, అడ్వకేట్ సునీల్ కుమార్, సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్, ఆర్‌టీఐ డైరెక్టర్ సాప పండరీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం ఐదు పరీక్ష కేంద్రాలలో జరిగిన పీజీ పరీక్షల్లో 1861 మంది విద్యార్థులకు 1784 మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. బీఈడీ పరీక్షల్లో 1544 మంది విద్యార్థులకు 1494 మంది హాజరుకాగా 50 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పంద్రాగస్టు వేడుకకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్



స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించనున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్



అతిథులు, అధికారులు కూర్చోడానికి ఏర్పాటు చేసిన కుర్చీలు

నిజామాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ ఎస్.నిరంజన్ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. వేడుకల్లో భాగంగా ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధం చేసింది.



త్రివర్ణ కాంతుల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

త్రివర్ణ శోభిత సాగరం

స్వాతంత్ర్య దినోత్స వేడుకల వేళ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు త్రివర్ణంలో కళకళలాడింది. ప్రాజెక్టు వరద గేట్లపై మువ్వన్నెల జెండా రంగులు వెలిగేలా ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే 44 మీదుగా వెళ్తున్న వారిని ప్రాజెక్టు అందాలు ఆకట్టుకున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్/బాల్కొండ

నా దేశం | అగ్రగామి కావాలి

'వందేళ్ల భారతం'పై యువత

- అవినీతి, పేదరికం లేకపోవడమే అసలైన స్వాతంత్ర్యం
- ప్రజాస్వామ్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి
- వేగవంతమైన అభివృద్ధి అవసరం
- సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్దాం
- 'సాక్షి' టాక్ షోలో మెడికల్ కళాశాల విద్యార్థులు







సాక్షి టాక్ షోలో మాట్లాడుతున్న వైద్య విద్యార్థి శ్రీకాంత్.. పాల్గొన్న మెడికోలు

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ నాగారం : ప్రపంచంలోనే 'నా దేశం' అగ్రగామి కావాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ఆకాంక్షించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో 'వందేళ్ల భారతం ఎలాంటి ఉండాలి..' అనే అంశంపై 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం 'టాక్ షో' నిర్వహించడం జరిగింది. పరిపాలన,టెక్నాలజీ, ఎడ్యుకేషన్, హెల్త్, తదితర రంగాలు ఎలా ఉండాలి, అందుకు తమ వంతుగా చేసే కృషిని మెడికోలు వివరించారు. అవినీతి, పేదరికం లేకపోవడమే అసలైన స్వాతంత్ర్యమని, ప్రజాస్వామ్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశానికి వ్యాక్సిన్ అందించిన మన దేశం.. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

ప్రపంచ దేశాలకు దిక్సూచిలా నిలుస్తుంది



విద్య, వైద్యం, టెక్నాలజీ, పరిపాలన, వ్యవసాయం తదితర అన్ని రంగాల్లో ప్రపంచంలోని ఇతర దేశాలకు దిక్సూచిలా మన దేశం నిలుస్తుంది. మనదేశంలోని ప్రతి ఒక్కరిలో టాలెంట్ ఉంది. కొవిడ్ వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందించిన ఘనత మనదే. రీసెర్చ్‌లతో మన దేశం ఎన్నో ఆవిష్కరణలకు వేదిక అవుతోంది. భవిష్యత్ తరాల కోసం అన్ని రంగాల్లో చాలా మార్పులు రావాలి. నూతన టెక్నాలజీకి అనుగుణంగా ప్రభుత్వాలు కొత్తకొత్త కోర్సులను ప్రవేశపెట్టాలి. 2047 కల్లా మన దేశం అగ్రామిగా ఉంటుంది.

– ఎస్ కృష్ణమోహన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ

అందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాస్వామ్యంలో సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి. పరిపాలనలో వివక్ష పనికిరాదు. అవినీతికి చోటు లేకుండా చేస్తే దేశం వేగంగా దూసుకెళ్తుంది. రిజర్వేషన్లు కూడా ఒక్కసారి పరిశీలించాలి. వందేళ్ల భారతంలో కుల, మతాలకు చోటుండొద్దు. నిజమైన పేదలు రిజర్వేషన్లు అనుభవించాలి. – లావణ్య

ప్రపంచానికి తలమానికం..



వైద్యరంగంలో ప్రపంచానికి భారతదేశం తలమానికంగా నిలుస్తుంది. ఏఐ కారణంగా వైద్యరంగంలో చాలా మార్పులు రాబోతున్నాయి. అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చిన రోగులు మళ్లీ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా భవిష్యత్‌లు అన్ని వైద్య సేవలందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగానికి నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నాయి. 2047 నాటికి దేశంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు పల్లె, పట్టణం తేడా లేకుండా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న నమ్మకం నాకు ఉంది.

– శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

కొత్త కోర్సులు.. అవకాశాలు



వైద్య విద్య పూర్తి చేసుకున్న వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో ఇతర దేశాలకు వెళ్తున్నారు. చాలా మంది ఇతర దేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో వైద్య రంగం వేగంగా ముందుకు వెళ్లాలంటే కొత్త కోర్సులు, అవకాశాలు అవసరం. – వర్షిణి

పేదలకు రిజర్వేషన్లు..



అన్ని కులాలు, మతాల్లోని పేదలకు రిజర్వేషన్లు వర్తించాలి. వందేళ్ల భారత్ ప్రపంచంలోనే ప్రత్యేకంగా ఉండాలంటే పేదరికం, అవినీతి అంతం కావాలి. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తా. – వోలివా

టెక్నాలజీ వాడుకోవాలి



నూతన టెక్నాలజీని వాడుకుంటూ దేశాభివృద్ధి కృషి చేయాలి. టెక్నాలజీని దుర్వినియోగం చేస్తే సమాజానికే ముప్పు వాటిల్లుతుంది. అదే పాజిటివ్‌గా తీసుకుంటే ఏ రంగంలో అయినా మనకు మంచే జరుగుతుంది. టెక్నాలజీని చాలా జాగ్రత్తగా ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లాలి. – శ్రీవల్లి

ఆత్మహత్యలు ఉండొద్దు



ఆత్మహత్యలు లేని భారత్‌గా దేశం మారాలి. చాలా మంది చిన్నచిన్న విషయాలకే కృంగిపోయి బలన్మరణాలకు పాల్పడుతున్నారు. నీట్ ర్యాంకు రాలేదనో, పరీక్షలో ఫెయిల్ అయ్యాననో ఆత్మహత్య చేసుకోవడం సరికాదు. బతికేందుకు చాలా మార్గలున్నాయి. మన శక్తిని దేశ, సమాజాభివృద్ధికి వినియోగిద్దాం. – ప్రజ్వల

అవినీతే సమస్య..

- స్వేచ్ఛ, సమానత్వం అంతంతే..
- అధికార యంత్రాంగం నీతి, నిజాయితీతో పని చేయాలి
- 'సాక్షి' సర్వేలో ప్రజల అభిప్రాయాలు

నిజామాబాద్ అర్బన్ : 79 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో అతి పెద్ద సమస్యగా అవినీతి ఉందని, స్వేచ్ఛ, సమానత్వం అంతంతేనని పలువురు అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' సర్వే నిర్వహించింది. స్వతంత్ర భారతంలో అవినీతి, పేదరికం పెద్ద సమస్యగా మారాయని, అధికారులు నీతి, నిజాయితీతో పని చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడు ప్రధాన ప్రశ్నలకు 30 మంది సమాధానాలిచ్చారిలా..

❖ మీరు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఏది..
(ఏ) అవినీతి (బీ) పేదరికం (సీ) నాణ్యమైన విద్య (డీ) వైద్యం (ఇ) కుల వివక్ష
☛ (ఏ)4 (బీ)3 (సీ) 1 (డీ) 1 (ఇ) 1

❖ స్వేచ్ఛ – సమానత్వం నిజంగానే అందరికి చేరుతోందా..
(ఏ) అవును (బీ) లేదు (సీ) కొద్దిగా
☛ (ఎ)4 (బీ)4 (సీ) 2

❖ స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాలంటే.. మరింత నీతి, నిజాయితీగా పనిచేయాల్సిన రంగం..
(ఏ) చట్ట సభలు (బీ) న్యాయ స్థానాలు (సీ) అధికార యంత్రాంగం (డీ) మీడియా
☛ (ఏ)2 (బీ) 2 (సీ) 5 (డీ) 1

సౌర వెలుగుల నడ్కుడ

ఆదర్శంగా నిలుస్తున్న జీజీ నడ్కుడ

డొంకేశ్వర్(ఆర్మూర్): పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అని బాపూజీ అన్న మాటలను నిజం చేస్తోంది మండలంలోని గంగగడ్డ (జీజీ) నడ్కుడ గ్రామం. బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొంది స్వాతంత్ర్య ఫలాలు ఇంటింటికీ అందుతున్న గ్రామంగా గుర్తింపు పొందుతోంది. గ్రామంలో ఇప్పటికే ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందుతుండగా, సోలార్ వినియోగంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌ను ఆనుకొని ఉన్న ఈ మారుమూల పల్లె మూడేళ్ల క్రితమే సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. గ్రామ పంచాయతీలకు భారీ విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో జిల్లాలో జీజీ నడ్కుడ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సోలార్ సిస్టంను ఏర్పాటు చేశారు. అప్పట్లో కలెక్టర్‌గా పనిచేసిన నారాయణ రెడ్డి 'గ్రీన్ విలేజ్' పేరిట దీనికి శ్రీకారం చుట్టారు. మొత్తం ఆరుచోట్ల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయగా, రూ.13లక్షల వరకు ఖర్చయింది. నిర్వహణ మొత్తం గ్రామ పంచాయతీ చూస్తుండగా, జీపీకి సంబంధించిన బోరు మోటార్లు, వీధి దీపాలకు 'సౌర' విద్యుత్‌ను వాడుతున్నారు. సోలార్ సిస్టం ఏర్పాటుకు ముందు జీపీకి ప్రతినెలా రూ.లక్షకు పైగా విద్యుత్ బిల్లు వచ్చేది. ఇప్పుడు సగం మాత్రమే వస్తోంది. సోలార్ సిస్టంతో విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకున్న జీజీనడ్కుడ బాటలోనే జిల్లాలోని మరిన్ని జీపీలు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

భారం తగ్గింది..



సౌర యూనిట్ల ఏర్పాటుకు ముందు విద్యుత్ బిల్లులు భారీగా వచ్చేవి. మూడేళ్ల నుంచి సోలార్ కారణంగా బిల్లుల భారం తగ్గింది. సోలార్ ద్వారా గ్రామంలోని విద్యుద్దీపాలు, బోరు మోటార్లను వినియోగిస్తున్నాం.

– సుప్రియ, పంచాయతీ కార్యదర్శి, జీజీ నడ్కుడ

చేనేతపై మమకారం

- అంతరిస్తున్న వృత్తిని నిలబెడుతోన్న రుద్రూర్ చేనేత సహకార సంఘం

రుద్రూర్: దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేతపై రుద్రూర్ వాసులు మమకారాన్ని ప్రదర్శిస్తున్నారు. అంతరించిపోతున్న చేనేతను కాపాడుకునేందుకు జిల్లాలోని బోధన్ సహకార సంఘం దశాబ్దాలుగా నష్టాలను ఎదుర్కొంటూ ముందుకు వెళ్తోంది. 40 ఏళ్ల క్రితం సంఘం పరిధిలోని రుద్రూర్ మండల కేంద్రంలో 25 మగ్గాలు, చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఇళ్లలో మరో 20 మగ్గాలపై చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేసేవారు. ధోవతులు, లుంగీలు, టవల్స్, చీరలకు అద్భుతంగా నేసేవారు. అప్పట్లో వీటికి ఎంతో డిమాండ్ ఉండేది. ఆ తరువాత మగ్గాలు మూలనపడ్డాయి. కాగా, బోధన్ చేనేత సంఘం ప్రస్తుత పాలకవర్గం నేత వృత్తిని కాపాడుకోవాలనే లక్ష్యంతో నాలుగేళ్ల క్రితం ఐదు మగ్గాలను పునరుద్ధరించింది. రుద్రూర్‌లో నాలుగు మగ్గాలపై కార్మికులు బెడ్‌షీట్స్ ఉత్పత్తి చేస్తున్నారు.



రుద్రూర్ చేనేత సంఘంలోని మగ్గముల శాల

ఇష్టంతో చేస్తున్నా..



చిన్నప్పటి నుంచి నేత పని చేశాను. మధ్యలో సంఘం బంద్ కావడంతో కుటుంబాన్ని పోషించేందుకు బీడీ కార్ఖానాలో చేరాను. మళ్లీ రుద్రూర్ సంఘంలో మగ్గాలు నడుస్తున్నాయని తెలుసుకొని రోజూ జాకోర నుంచి వచ్చి బెడ్‌షీట్‌లు నేస్తున్నా. చిన్నప్పటి పని మళ్లీ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– సుప్పల నర్సింలు, నేత కార్మికుడు

సహకార పదవీకాలం పొడిగింపు

- మరో ఆరు నెలల ఎక్స్‌టెన్షన్ ఇస్తూ జీవో..
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీకాలన్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పొడిగించింది. ఈ మేరకు జీవో నం.386ను గురువారం విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పొడిగించిన పదవీకాలం కూడా ఈ నెల 14తో ముగియడంతో మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. జిల్లాలోని 89 సొసైటీల ద్వారా పాత పాలకవర్గాలే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సేవలందించనున్నాయి.

ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేక..

కొత్త రెవెన్యూ మండలాల్లో కొత్త సొసైటీల ఏర్పాటు, విభజన చేయాల్సి ఉన్నందున ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొంది. సొసైటీల సంఖ్యను పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది.

ఎన్‌డీసీసీబీ..

సుభాష్‌నగర్ : ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) పాలకవర్గం పదవీ కాల పరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరునెలల కాలంలో ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో చైర్మన్ రమేశ్‌రెడ్డి రూ.2వేల కోట్ల వ్యాపార లావాదేవీలతోపాటు ఎన్‌పీఏను గణనీయంగా తగ్గించి డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకొచ్చారు.

సీఎం, మంత్రివర్గానికి కృతజ్ఞతలు

డీసీసీబీ పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులకు, జహీరాబాద్ ఎంపీ షెట్కార్‌కు చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

వర్షపు నీరు నిలువకుండా చూడాలి

- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో సీపీ సాయిచైతన్య, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఈఈ మురళీమోహన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. మురుగు కాలువల్లో పూడికతీతలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, ఆయా నివాస ప్రాంతాల్లో చెత్తాచెదారం మురుగు కాలువల్లోకి చేరి నీరు నిలువకుండా చూడాలన్నారు. దుబ్బ–ఖానాపూర్ రోడ్డులోని పెద్ద డ్రెయినేజీ, నిజాం కాలనీ, తీన్ కమాన్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు ఉన్న డ్రెయినేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతంలో వరద తాకిడికి గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. అనంతరం పోలీస్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంను కలెక్టర్, సీపీలు సందర్శించి, నగరంలో తాజా పరిస్థితులను పరిశీలించారు. వారి వెంట డీసీ ఎం.రవి బాబు, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్..



చెత్తను తొలగిస్తున్న రెస్క్యూ టీమ్

ఓటరు జాబితాలో గోల్‌మాల్



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటరు జాబితాను గోల్‌మాల్ చేసిందని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని నిరసన తెలుపుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి నెహ్రూ పార్క్ నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాలతో క్యాండిల్‌ర్యాలీ నిర్వహించామన్నారు. ఓటరు జాబితాలో అక్రమాలను రాహుల్‌గాంధీ బహిరంగపరిచిన విషయాన్ని గుర్తుచేశారు.

కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, జీవీ రామకృష్ణ, నరేందర్‌గౌడ్, మఠం రేవతి, ప్రమోద్, పోల ఉష, పుప్పాల శోభ తదితులు పాల్గొన్నారు.

జాతి ఆత్మగౌరవానికి ప్రతీక.. జాతీయ పతాకం

- నేడు స్వాతంత్ర్య దినోత్సవం
- వీధివీధిన రెపరెపలాడనున్న త్రివర్ణ పతాకం



ఆర్మూర్: ఎటు చూసినా రాజకీయ పార్టీల జెండాలే దర్శనం ఇవ్వడంతో 145 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న మువ్వన్నెల జెండాకు గుర్తింపు కరువవుతోంది. ఇలాంటి తరుణంలో మన జాతీయ జెండా ప్రాముఖ్యతను, నియమాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలి. నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ప్రాముఖ్యత, నియమాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

జాతీయ జెండా రూపకల్పన ఇలా..

1921లో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో బందరుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించి గాంధీజీకి చూపించారు. రెండు గడులు పచ్చగా ఒక గడి ఎరుపుగా ఉండేది. గాంధీజీ ఆ పతాకానికి కొన్ని మార్పులు సూచించారు. దాని ప్రకారం తెలుపు, పచ్చ, ఎరుపు రంగుల మధ్య చరఖా వచ్చి చేరింది. నేటి మన జాతీయ పతాకానికి మాతృక ఇది. 1931లో కరాచిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కాంగ్రెస్ నాయకత్వం జాతీయ పతాకం రూపొందించడం కోసం ఒక సబ్ కమిటీని నియమించింది. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఎరుపు, తెలుపు, ఆకుప్చ రంగులున్న పతాకాన్ని రూపొందించారు. తెలుపు రంగులో నీలి రంగు చరఖాను ఏర్పరిచారు. ఈ పతాకాన్ని కాంగ్రెస్ కమిటీ ఆమోదించింది. ఆ తర్వాత జాతీయ జెండాలో రాట్నానికి బదులుగా అశోక ధర్మ చక్రాన్ని చేర్చమని అంబేడ్కర్ ప్రతిపాదించగా, సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ సమర్థించారు. దీంతో జాతీయ పతాకం మధ్యలో నీలి రంగులో 24 మొనలు కలిగిన అశోక ధర్మ చక్రాన్ని ముద్రించారు. ఈ జాతీయ పతాకాన్ని భారత రాజ్యాంగ సభ 1947 జూలై 22న ఆమోదించింది.

నిబంధనలు..

- జెండా దీర్ఘ చతురస్రాకారంలో ఉండి, పొడవు, వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉండాలి.
- సమ నిష్పత్తిలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు కలిగిఉండాలి. మధ్యలో నీలి రంగులో 24 మొనలు కలిగిన అశోక ధర్మ చక్రం రెండు వైపులా కనిపించేలా ఉండాలి.
- పతాకాన్ని గౌరవప్రదమైన ప్రదేశాల్లో ఎగుర వేయాలి.
- జెండాలోని కాషాయ రంగు పైకి వచ్చేలా కట్టాలి.
- జాతీయ పతాకం కంటే ఎత్తుగా మరే పతాకం ఎగుర వేయకూడదు.
- కుడి వైపున ఇతర జెండాలను పెట్ట కూడదు. జెండాను అలంకరణగా వాడరాదు.
- పతాకాన్ని నేలకు తగిలేలా ఉంచరాదు.
- ఎగర వేసేటప్పుడు జెండా వైపే చూస్తూ, నిలబడి వందనం చేయాలి. అనంతరం జాతీయ గీతాలాపన చేయాలి.
- సూర్యోదయం కంటే ముందు జెండాను ఎగురవేయకూడదు.
- సూర్యాస్తమయం సమయంలోనే కిందికి దించాలి.
- ప్రభుత్వ భవనాలపై త్రివర్ణ పతాకం ఎల్లప్పుడు ఎగురవచ్చు.
- దేశ ప్రముఖులు చనిపోతే సంతాప సూచకంగా పతాకాన్ని అవతనం చేయాలి.
- చినిగిన, నలిగిన పతాకాన్ని ఎగురవేయరాదు.

జిల్లాకు భారీ వర్ష సూచన

- రానున్న 48 గంటలపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఉద్యోగుల సెలవులు రద్దు
- స్థానికంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు



నిజామాబాద్‌అర్బన్: రానున్న 48 గంటలపాటు జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సైతం హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలతోపాటు వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో 24 గంటలపాటు సిబ్బంది విధుల్లో ఉండేలా ఆదేశాలు చేశారు. మండలాలు, రెవెన్యూ డివిజన్లతోపాటు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇది వరకే ఉద్యోగులకు సెలవులను రద్దు చేశారు. రెవెన్యూ, పంచాయతీ, వైద్య సిబ్బంది 24గంటలపాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ముందుగానే గుర్తించి అందులో నివసించే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇతర భవనాలను పునరావాస కేంద్రాలుగా మార్చారు. సహాయక చర్యలు చేపట్టేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్, పోలీసు సిబ్బందితో కూడిన బృందాలను సిద్ధంగా ఉంచారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రెండ్రోజులుగా అధికారులు,సిబ్బంది రాత్రింబవళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

2.3 మిల్లీమీటర్ల వర్షం

రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నా, జిల్లాలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైంది. గురువారం సైతం జిల్లావ్యాప్తంగా 2.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 14 మండలాల్లో సాధారణ, 19 మండలాల్లో సాధారణ కన్నా తక్కువ వర్షపాతం రికార్డు అయింది. నిజామాబాద్ సౌత్ మండలంలో 5.3, ఏర్గట్ల 7.9, రెంజల్ 6.0, నందిపేట 4.3, మెండోరాలో 4.4 మి.మీ. వర్షం కురిసింది. ఇందల్వాయి, సిరికొండ, కోటగిరి, పోతంగల్, చందూరు మండలాల్లో సున్నా వర్షపాతం నమోదైంది.

కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ కంట్రోల్ రూం

సుభాష్‌నగర్: అధిక వర్షాల సూచన నేపథ్యంలో నగరంలోని కలెక్టరేట్‌లో విద్యుత్‌శాఖ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ రాపల్లి రవీందర్ గురువారం తెలిపారు. కంట్రోల్ రూంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండేలా విధులను సర్దుబాటు చేశామన్నారు. ఏడీఈలు తోట రాజశేఖర్, లక్ష్మణ్ నాయక్, పోలేవార్ రవిలకు కంట్రోల్ రూం బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. రెండ్రోజుల పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఏఈలకు తెలియజేసి త్వరితగతిన పునరుద్ధరణకు చర్యలు చేపడుతారన్నారు.

బల్దియాలో..

నిజామాబాద్ సిటీ: భారీ వర్షాల నేపథ్యంలో బల్దియా కార్యాలయంలో ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 08462-221001 కేటాయించామన్నారు.

ఎస్సారెస్పీలోకి 13,910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 13,910 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500, సరస్వతి కాలువ ద్వారా 500, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఆవిరి రూపంలో 482 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1080.30(46.00 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. లక్ష్మికాలువ, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సొసైటీ చైర్మన్ మృతి



రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని దొన్కల్ శివారులోగల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ సింగిడి రాజేశ్వర్‌రెడ్డి(70) మృతిచెందారు. వివరాలు ఇలా.. దొన్కల్ గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి గురువారం బైక్‌పై పొలానికి వెళ్లాడు. కొద్దిసేటికే ఇంటికి తిరిగి బయలుదేరాడు. దొన్కల్ శివారులోని హైవేపై అతడి బైక్‌ను మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళుతున్న పశువుల వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కూతురు రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు. రాజేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమెరికాలో ఉండటంతో అంత్యక్రియలు జరగడానికి ఒకటి రెండు రోజులు పట్టే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

మాక్లూర్: బ్రేకులు ఫెయిల్ కావడంతో ఓ కారు చెరువులోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని కల్లెడిలో చోటుచేసుకుంది. మాక్లూర్ మండలం బోర్గాం (కె) గ్రామానికి చెందిన రాజారాం శ్రీనివాస్ గురువారం తెల్లవారుజామున కల్లెడి గ్రామానికి కారులో బయలుదేరాడు. కల్లెడి చెరువుకట్టపై కారు బ్రేకులు ఫెయిల్ కావడతో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. చెరువులో నీరు తక్కువగా ఉండటం వల్ల శ్రీనివాస్ ప్రాణాలతో బయటపడ్డారు. కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు.



నా దేశం అగ్రగామి కావాలి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో 'వందేళ్ల భారతం ఎలాంటి ఉండాలి..' అనే అంశంపై 'సాక్షి' జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం 'టాక్ షో' నిర్వహించింది. ఈసందర్భంగా మెడికల్ కళాశాల విద్యార్థులు పలు అంశాలను ప్రస్తావించారు. ప్రపంచంలోనే 'నా దేశం' అగ్రగామి కావాలని మెడికల్ కళాశాల విద్యార్థులు ఆకాంక్షించారు. –నిజామాబాద్ అర్బన్/ నిజామాబాద్ నాగారం

అంతా టెక్నాలజీ మయం



భవిష్యత్ అంతా టెక్నాలజీ మయమవుతుంది. అన్ని రంగాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అందుకు అనుగుణంగా వైద్య రంగంలో వేగంగా మార్పులు రావాలి. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలి. భవిష్యత్‌లో వచ్చే మార్పులకు అనుగుణంగా వైద్యులుగా మేమంతా మారుతాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ఆరోగ్యభారతాన్ని నిర్మిస్తాం. – శ్రీకాంత్

లాభాలతోపాటు నష్టాలు..



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో లాభాలతోపాటు నష్టాలూ ఉన్నాయి. భవిష్యత్‌లో అన్ని రంగాల్లో ఏఐ కీలకపాత్ర పోషిస్తుంది. వైద్య రంగంలోనూ వచ్చే విప్లవాత్మక మార్పులను గమనిస్తూ ముందుకు వెళ్తాం. ఎంబీబీఎస్, ఇంజినీరింగ్‌లో ఏఐ ఉపయోగం ఎంత వరకు అవసరమో అంతే తీసుకోవాలి. లేకుంటే మనకే ఇబ్బందులు తప్పవు. – రాకేశ్

సమాన అవకాశాలు ఉండాలి



ప్రస్తుత సమాజంలో వివక్ష చాలా ఉంది. వందేళ్ల స్వాతంత్ర్య భారతంలో ఈ పరిస్థితి కనిపించొద్దు. బాలబాలికలకు అన్నింటిలో సమాన అవకాశాలు ఇవ్వాలి. విద్య, వైద్యం అభివృద్ధిలో ప్రధానపాత్ర పోషిస్తాయి. పాలకులు వీటిపై దృష్టి సారించాలి. – సత్యశ్రీ

విలువలు పాటించాలి



ప్రస్తుతం సమాజంలో విలువలకు ప్రాధాన్యత లేకుండా పోతోంది. మానవత్వంతో జీవిస్తేనే మనుగడ బాగుంటుంది. సోషల్ మీడియా ప్రభావం మనపై లేకుండా చూసుకుంటూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి. – అక్షిత

స్నేహ పూర్వక పోటీతో ముందుకు..



వైద్య, విద్య ఇలా ఏరంగమైనా స్నేహ పూర్వక పోటీతో ముందుకు వెళ్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా వైద్య రంగంలో రోగులకు నిస్వార్థంగా సేవలందాలి. భవిష్యత్‌ను తీర్చదిద్దుకునేందుకు టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుంది. దానిని దుర్వినియోగం చేయొద్దు. – ఎండీ ఫరాజ్

కుటుంబానికి ఒకసారే రిజర్వేషన్..



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ అంటు రిజర్వేషన్లు ఇంకా ఎంత కాలం ఉంటాయి. ఒక్క కుటుంబంలో ఒక్కసారి రిజర్వేషన్ ద్వారా ఒకరు లబ్ధి పొందితే మళ్లీ వారికి రిజర్వేషన్ ఉండొద్దు. అన్ని కులాలు, మతాల్లో పేదలకు మా త్రమే సంక్షేమ ఫలాలు అందాలి. నాయకులు స్వార్థపూరిత హామీలు ఇవ్వొద్దు. – సౌమ్య

మారితేనే భవిష్యత్.



మనం మారాలి.. మనతోపాటు నాయకులు కూడా మారాలి. అప్పుడే భవిష్యత్ బాగుంటుంది. అవినీతి, స్కామ్‌లు లేని భారత్‌ను నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దాం. విద్య, వైద్య రంగాలది కీలకపాత్ర ఉంటుంది. వైద్య విద్యార్థిగా దేశాభివృద్ధిలో భాగస్వామినవుతా. – ప్రతీక్

ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చూడాలి

- వీసీలో మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీఎస్
- క్షేత్రస్థాయిలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారు : కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య తదితరులు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, పోలీస్ కమిషనర్లతో సమీక్షించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ కూడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా రూ. కోటి చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాధారణ స్థాయిలోనే వర్షాలు కురుస్తున్నాయని, గురువారం ఉదయం సగటున 23 మి.మీ వర్షపాతం నమోదైందని మంత్రులు, సీఎస్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, అయినప్పటికీ రానున్న 48గంటలపాటు భారీ వర్ష సూచన దృష్ట్యా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సన్నద్ధమై ఉన్నారని వివరించారు. ఇప్పటికే అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేశామన్నారు. జిల్లాలోని ఎస్సారెస్పీకి తక్కువగానే ఇన్‌ఫ్లో వస్తోందని, పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని, ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నామని తెలిపారు. 100 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, శిక్షణ పొందిన మరో 20 మందితో కూడిన పోలీస్, ఫైర్ బృందం ఉందని, ఒక బృందాన్ని మెదక్ జిల్లాలో సహాయక చర్యలకు పంపించినట్లు పేర్కొన్నారు. వీసీలో సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



పెర్కిట్(ఆర్మూర్): కేజీబీవీ పాఠశాల విద్యార్థిని కావేరి మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సూచించారు. పెర్కిట్ కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని కావేరి మృతిపై సబ్ కలెక్టర్ గురువారం పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి గంగమణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోటి విద్యార్థినులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థిని అర్ధరాత్రి వాష్ రూంకు వెళ్లగా కోతులు వెంబడించడంతో భయపడి, పరిగెత్తుతూ ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి పడిందని పాఠశాల అధికారిణి సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున పారదర్శకంగా విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కోతుల బెడద నివారణకు పాఠశాల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తహసీల్దార్ పాల్గొన్నారు.

పెళ్లి వ్యాన్ బోల్తా: 15 మందికి గాయాలు



డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లి గ్రామ శివారులో గురువారం సాయంత్రం పెళ్లి వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ మండలం అర్సపల్లి గ్రామానికి చెందిన యువతితో ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన సట్ల అనిల్‌కు గురువారం పెళ్లి జరిగింది. మల్లాపూర్‌కు వచ్చిన వధువు తరపు బంధువులు సుమారు 50 మంది సాయంత్రం వ్యాన్‌లో అర్సపల్లికి బయలుదేరారు. మిట్టాపల్లి గ్రామశివారులోని మహాలక్ష్మీ ఆలయం మలుపు వద్ద వారి వ్యాన్ ప్రమాదవశాత్తు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది గాయపడగా, వారిలో బాగిర్తి చంద్రయ్య, రాజయ్యలకు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం తెలియగానే మల్లాపూర్ మిట్టపల్లి గ్రామానికి చెందిన పలువురు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు



ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను అరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్... నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్, కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్, కూతురు పేరు జైహింద్ జగ్యాన్ సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.


First Indian dog to paint our beloved Indian flag

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్–జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాదు అని వాళ్ల కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదే మిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి - వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి.

ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమ మాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం

> పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ 'షోలే'. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్లు. సూక్తులు.
>
> - ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అచ్ఛీ హై (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
> - ముఝేతో సబ్ పోలీస్ వాలోంకీ సూరత్ ఏక్ జైసీ లగ్ తీ హై (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
> - తేరా క్యా హోగా కాలియా (నీ గతేంది కాలియా)
> - తుమ్హారా నామ్ క్యా హై బసంతి? (నీ పేరేంటి బసంతి)
> - దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కమాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్సు పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది.

ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.